

రేపే సామాజిక పెన్షన్ల పంపిణీ

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 31వ తేదీన సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియను చేపడతామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఈనెల 31న పెన్షన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.జిల్లాలోని 22 మండలాల్లో ఒక లక్షా 25 వేల 262 మంది లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును అందిస్తామన్నారు. ఏదైనా కారణంతో 31న పెన్షన్ అందుకోలేని వారికి సెప్టెంబరు రెండో తేదీన అందిస్తామన్నారు. ఇందుకోసం రూ. 52 కోట్ల 14 లక్షలు మంజూరు చేసిందన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్‌కు ఐఎన్ఎస్ డేగాలో స్వాగతం పలుకుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

- నేవల్ బేస్‌లో 'ఐఎన్ఎస్ అరిఘాత్' జాతికి అంకితం చేసిన రాజ్‌నాథ్ సింగ్

విశాఖపట్నం, ఆగస్టు 29: నగరానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ విమానాశ్రయంలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాజ్‌నాథ్‌సింగ్‌కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నేవల్‌బేస్‌కు వెళ్లారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రెండో అణు జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాత్'ను జాతికి అంకితం చేశారు. మూడు గంటలకు ప్రత్యేక విమానంలో తిరువనంతపురం బయలుదేరి వెళ్లారు.

ఐటీ రాజధానిగా విశాఖ

రాష్ట్రానికి వచ్చే ఐటీ పరిశ్రమల్లో 90 శాతం ఇక్కడే ఏర్పాటుచేస్తాం

- సమస్యల పరిష్కారానికి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు
- రాయితీకి భూముల కేటాయింపుపై మంత్రివర్గంలో చర్చిస్తాం
- గత ప్రభుత్వంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తాం
- విశాఖ విమానాశ్రయానికి కనెక్టివిటీ పెంపు
- అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తాం
- ఐటీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ భరోసా



మంత్రి లోకేశ్‌ను సత్కరిస్తున్న ఐటీ పరిశ్రమల నిర్వాహకులు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖను ఐటీ రాజధానిగా అభివృద్ధి చేస్తామని, రాష్ట్రానికి వచ్చే ఐటీ పరిశ్రమల్లో 90 శాతం ఇక్కడే ఏర్పాటు చేస్తామని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఐటీ పారిశ్రామికవేత్తలతో ఆయన గురువారం రాత్రి నోవాటెల్ హోటల్‌లో సమావేశమయ్యారు. సుమారుగా రెండు గంటలసేపు సాగిన సమావేశంలో హాజరైన ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించారు. వారు అడిగిన ప్రశ్నలు అన్నింటికీ మంత్రి ఓపికగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ విధానాలు వివరించారు. గత ఐదేళ్లు ఐటీని ఎవరూ ... మిగతా 7వ పేజీలో

మన్యం రోడ్లకు మహర్దశ

'పీఎం జన్‌మన్'తో మారుమూల రహదారులకు మోక్షం

- రూ.300 కోట్లతో 148 రోడ్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఆదిమజాతి గిరిజన గ్రామాల్లో తారురోడ్లకు ప్రాధాన్యం
- భవిష్యత్తులో డోలీ మోతలకు పరిష్కారం లభించే అవకాశం



కనీస సదుపాయాలను నోచుకోని మారుమూల గిరిజన పల్లె



కొండకోనలు, గెడ్డలు దాటుకుంటూ రోగిని డోలీలో మోస్తున్న ముంచంగిపుట్టు మండలం ఉబ్బెంగుల గిరిజనులు (ఫైల్)

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలోని మారుమూల ప్రాంత రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌మన్ యోజనలో ఆదిమజాతి గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా గిరిజన పల్లెలకు పక్కాగా తారు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. తొలి విడతగా ఏజెన్సీలో 148 తారురోడ్ల నిర్మాణానికి రూ.300 కోట్లను మంజూరు చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీలో వందలాది మారుమూల గ్రామాలకు రోడ్డు, రవాణా సదుపాయం కలగనుంది.

పీఎం జన్‌మన్‌తో గిరిజనులకు మేలు

దేశంలో ఎంతో వెనుకబాటుకు గురైన ఆదిమ జాతి గిరిజనుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో ఈ ఏడాది జనవరి 19న ప్రధానమంత్రి జన్‌మన్ యోజనను ప్రారంభించారు. అందులో భాగంగా గిరిజన ప్రాంతాల్లోని ఆదిమ జాతి గిరిజనులు జీవిస్తున్న పల్లెల్లో మౌలిక సదుపాయాలతోపాటు అక్కడ జీవిస్తున్న గిరిజనులకు ఇళ్లు, స్వయం ఉపాధి కార్యక్రమాలు సైతం చేపట్టాలని నిర్ణయించారు. మారుమూల కొండకోనల్లో జీవిస్తుండడంతో వారి ఆవాసాలకు తారురోడ్డు, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, హెల్త్ సబ్‌సెంటర్‌కు ఉపయోగపడేలా బహుళ ప్రయోజన సామాజిక భవనాల నిర్మాణం ... మిగతా 8వ పేజీలో

ఏజెన్సీలో మండలాల వారీగా నిర్మించే రోడ్ల వివరాలు

వ. సం	మండలం	రోడ్ల సంఖ్య
1.	అనంతగిరి	6
2.	అరకులోయ	7
3.	చింతపల్లి	15
4.	డుంబ్రిగుడ	14
5.	జి.మాడుగుల	15
6.	జీకేవీధి	14
7.	హుకుంపేట	4
8.	కొయ్యూరు	19
9.	ముంచంగిపుట్టు	32
10.	పెదబయలు	21
11.	పాడేరు	1
	మొత్తం	148

ఏరియా ఆస్పత్రి ప్రక్షాళన

చర్యలు తీసుకుంటున్న అధికారులు
అరగంట ఆలస్యమైతే ఆబ్సెంట్



చింతపల్లి ఏరియా ఆస్పత్రి

- విధులకు గైర్హాజరైన ఎనస్థీషియా సరండర్
- వారానికి రెండు రోజులు విధులకు హాజరయ్యే వైద్యులు రాజీనామా
- ప్రత్యేక వైద్య నిపుణుల భర్తీకి చర్యలు

చింతపల్లి, ఆగస్టు 29:

స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రక్షాళనకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న ఎనస్థీషియా వైద్యుడిని అధికారులు సరండర్ చేశారు. ఆస్పత్రి ఉద్యోగులు అరగంట ఆలస్యంగా విధులకు హాజరైతే ఆబ్సెంట్ వేస్తున్నారు.

స్థానిక 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం రెండేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేసింది. వంద పడకల ఆస్పత్రికి అవసరమైన వైద్యులు, దిగువస్థాయి ఉద్యోగుల పోస్టులను మంజూరు చేసింది. అయితే పూర్తి స్థాయిలో వైద్యులను భర్తీ చేయలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది వైద్యులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరయ్యేవారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆదివాసీ రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. దీంతో సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శిరి పర్యవేక్షణలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులను పటిష్టం చేశారు. వైద్యులు, ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



ఏరియా ఆస్పత్రి చికిత్స కోసం వచ్చిన రోగులు

ముగ్గురు వైద్యులకు ఉద్వాసన..

ఏరియా ఆస్పత్రిలో పేరుకు మాత్రమే వైద్యులుగా పనిచేసే ముగ్గురు వైద్యులకు సెకండరీ హెల్త్ అధికారులు ఉద్వాసన పలికారు. సుమారు ఆరు నెలలుగా విధులకు గైర్హాజరైన సీనియర్ ఎనస్థీషియా వైద్యుడుని సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ సరండర్ చేశారు. అలాగే రెండో ఎనస్థీషియా, జనరల్ సర్జన్ వైద్యులు వారానికి రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతామని, మిగిలిన రోజులు సెలవు కావాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని కోరారు. కచ్చితంగా ప్రతి రోజు విధులకు హాజరుకావాలని సూపరింటెండెంట్ ఆదేశించడంతో రెండో ఎనస్థీషియా, జనరల్ సర్జన్ వైద్యులు ఇద్దరూ ఉద్యోగాలకు రాజీనామా చేశారు.

కచ్చితంగా సమయపాలన పాటించాల్సిందే..

నూతనంగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గంటా ప్రభావతి వైద్యులతోపాటు ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకున్నారు. సెకండరీ హెల్త్ ... మిగతా 8వ పేజీలో

ఘాట్ మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశం



కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని ఘాట్ మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో మారేడుమిల్లి ఘాట్‌లో మట్టి పెళ్లలు విరిగిపడడంతోపాటు ఓ మలుపు వద్ద భారీ లారీ ఆగిపోవడంతో ఘాట్‌లో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భారీ వర్షాల నేపథ్యంలో రానున్న మూడు రోజులు జిల్లాలోని అన్ని ఘాట్ మార్గాల్లోని భారీ వాహనాలను అనుమతించవద్దని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను ఆదేశించారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ కేంద్రాల్లోనే ఉండాలని, భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే తమకు సమాచారం అందించాలన్నారు. అవసరమైన మేరకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకుని వర్షాల ప్రభావం, అత్యవసర సేవలను పర్యవేక్షించాలన్నారు. వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగే ప్రమాదముందని, ఈక్రమంలో మారుమూల ప్రాంత ప్రజలు గెడ్డలు దాటడం వంటివి చేయవద్దన్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు.

నేటి 'మీ కోసం' కార్యక్రమం రద్దు

ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదిక మీ కోసం కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ప్రకటించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు గ్రామాల్లోనే సురక్షితమైన ప్రాంతాల్లోనే ఉండాలన్నారు. వర్షాల కారణంగా ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయనే ఉద్దేశంతో మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో ముసురు

అల్పపీడన ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షం

- జనజీవనానికి అంతరాయం
- పొంగుతున్న గెడ్డలు, వాగులు
- పంటలకు అనుకూలమంటున్న రైతులు



ముంచంగిపుట్టులో వర్షం

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురువారం జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం కాగా.. జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ చిత్తడి మారడడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు చేరింది. ఈ వర్షాలు ముందస్తు రబీ సాగుకు, మెట్టప్రాంతాల్లోని చిరుధాన్యాల పంటలకు అనుకూలిస్తాయని గిరిజన రైతులు అంటున్నారు.

హుకుంపేటలో..

మండలంలోని గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు చిత్తడిగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన కురవడంతో ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ముంచంగిపుట్టులో..

మండల పరిధిలో గురువారం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగులు, మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. మట్టి రహదారులు బురదమయంగా మారవడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నాలుగు రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించింది.

అరకులోయలో..

పట్టణంలో రెండు రోజుల నుంచి ముసురు వాతావరణం కొనసాగుతునే ఉంది. పనులకు ఆటంకంగా మారింది. విధులకు హాజరయ్యే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు.

నర్సీపట్నం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియామకం



కేఆర్ కల్పశ్రీ

నర్సీపట్నం, ఆగస్టు 29: నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా ఇటీవల నియమితులైన కేఆర్ కల్పశ్రీని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం స్థానంలో 2022 బ్యాచ్‌కి చెందిన కేఆర్ కల్పశ్రీని సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ గత ఆదివారం ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసింది. శిక్షణ పూర్తి చేసుకొని మొదటి పోస్టింగ్ నర్సీపట్నం సబ్‌కలెక్టర్‌గా ఆమె విధుల్లోకి చేరకముందే రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

వచ్చే నెలలో ఏకలవ్య పాఠశాలలు ప్రారంభం

ఐటీడీఏ పీవో అభిషేక్

- వార్త 8వ పేజీలో

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


యకా ప్రేమ అంజి (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, ఆగస్టు 29: మండలంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామన్నపాలెం గ్రామానికి చెందిన యకా ప్రేమ అంజి(21) బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేస్తే.. స్విచ్ఛాఫ్ అని వస్తున్నది. గురువారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు తమ కుమారుడు అదృశ్యం అయ్యాడంటూ ప్రేమ అంజి తండ్రి రాజబాబు గురువారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో ఎరకన్నపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనున్న నేలబావిలో ప్రేమ అంజి మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఎస్.ఐ. రామకృష్ణారావు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని నేలబావిలో నుంచి బయటకు తీయించారు. మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కాగా ప్రేమ అంజి డిగ్రీ పూర్తిచేశాడని, అల్యూమినియం కంపెనీలో ఇటీవల నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలో ఎంపికయ్యాడని, వచ్చే నెల నాలుగో తేదీన విధుల్లో చేరాల్సి వుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతిచెందిన దుర్గారావు

చోడవరం, ఆగస్టు 29: పట్టణ శివారులోని గాంధీగ్రామంలో కొబ్బరిచెట్టు పైనుంచి పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన కోణాల దుర్గారావు(45) బుధవారం సాయంత్రం కొబ్బరికాయలు దించడం కోసం చెట్టు ఎక్కాడు. పైకి వెళ్లిన తరువాత పట్టుజారడంతో కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ శేఖరం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఈపీడీసీఎల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


బోయిన రామరాజు (ఫైల్‌ఫొటో)

కొత్తూరు(అనకాపల్లి), ఆగస్టు 29: ఏపీఈపీడీసీఎల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కరెంటు స్తంభంపై పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన బోయిన రామరాజు (39) ఈపీడీసీఎల్‌లో ఔట్‌సోర్సింగ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో మరమ్మతు పనులు చేస్తున్నారు. గురువారం ఉదయం కరెంటు స్తంభం ఎక్కి పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందకి పడిపోయాడన్నారు. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటీన అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. మృతుడు భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా రామరాజుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కొణతాల పరామర్శ

అనకాపల్లి టౌన్: జగన్నాథపురంలో విద్యుదాఘాతానికి గురై గురువారం మృతిచెందిన బోయిన రామరాజు కుటుంబసభ్యులను ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరామర్శించారు మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా


ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎదురుగా రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం

మృతి చెందిన రాజురాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు గురువారం సాయంత్రం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట ధర్నా చేశారు రామరాజు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని ఆందోళకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, సీపీఎం నాయకుడు గంటా శ్రీరామ్, సీపీఐ నాయకుడు రాజాన దొరబాబు, ఏఐటీయూసీ ప్రతినిధులు, మృతుడు కుటుంబసభ్యులు, బంధువులు పాల్గొన్నారు. దీంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారని రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలి మృతి

ఎస్.రాయవరం, ఆగస్టు 29: మండలంలోని అడ్డరోడ్డు వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకురాలు మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మృతురాలు స్థానికంగా యాచిస్తున్నదని, ఈమెను లక్ష్మి అని పిలుస్తారని చెప్పారు. ఆమె గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

దేవరాపల్లిలో భారీ చోరీ

» రూ.1.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణ

దేవరాపల్లి, ఆగస్టు 29: స్థానిక బండారు వీధిలోని ఒక ఇంటిలో భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు రూ.1.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

దేవరాపల్లికి చెందిన గుల్లిపల్లి అచ్చిబాబు, భార్య తల్లిదండ్రులతో కలిసి బండారు వీధిలో నివాసం వుంటున్నారు. ఇతను స్థానికంగా ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. భార్య ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం అచ్చిబాబు స్టూడియోకు, భార్య పాఠశాలకు వెళ్లిపోయారు. తండ్రి అప్పలనాయుడు పొలం పనులకు వెళ్లగా, తల్లి నారాయణమ్మ కొద్దిసేపటి తరువాత ఇంటికి తాళం వేసి, తాళం చెవిని పక్క ఇంటి వారికి ఇచ్చి విశాఖ బయలుదేరి వెళ్లింది. బుచ్చిబాబు మధ్యాహ్నం వచ్చి, పక్కింటి వారి నుంచి తాళం చెవి తీసుకుని భోజనం చేశాడు. బ్యాంకు రుణం చెల్లించడానికి డబ్బుల కోసం కప్‌బోర్డు వద్దకు వెళ్లగా.. తలుపులు తీసి వున్నాయి. దీంతో ఆందోళన చెందిన అతను స్టీల్ బాక్సులో భద్రపరిచిన లక్షా 50 వేల నగదుతోపాటు సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529


పాతకృష్ణాదేవిపేటలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు, నిలిచిన వర్షం నీరు


పాత కృష్ణాదేవిపేటలో పూర్తిగా ఛిద్రమై, ఆనవాళ్లు లేని తారు రోడ్డు

రహదారులు ఛిద్రం

» వర్షాలతో మరింత అధ్వానం
» వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు

కృష్ణాదేవి పేట, ఆగస్టు 29:
గొలుగొండ మండలంలో పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, ఏఎల్‌పురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లో వెళ్లే రహదారులు గోతులమయంగా మారాయి. ఇప్పటికే అధ్వానంగా వున్న రోడ్లు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరింత దారు ణంగా తయారయ్యాయి. గోతుల్లో వర్షం నీరు చేరడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నీరు నిలిచిన గోతులు ఎంత లోతు వున్నాయో అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో కొత్తగా ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఎక్కడ గోతులు వున్నాయో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై గోతులు పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొంగసింగి వెళ్లే రహదారిలో గొయ్యి


సోమలింగపాలెం, రామారాయుడుపాలెం గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురవ్వడంతో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్, డీఈఈ

కోతకు గురైన రోడ్డు

» రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఎలమంచిలి, ఆగస్టు 29:
ఇటీవల కురిసిన వర్షాలకు మునిసిపాలిటీలోని సోమలింగపాలెం-రామారాయుడు గ్రామాల రోడ్డు కోతకు గురవ్వడంతో ప్రజల రాకపోకలకు కష్టమవుతోంది. ఈ రోడ్డు మీదుగా రామారాయుడుపాలెం నుంచి సోమలింగపాలెంలో హైస్కూలు చదువులకు వెళ్లే విద్యార్థులతోపాటు స్థానికులు అవస్థలు పడుతున్నారు. గురువారం ఇన్‌చార్జి కమిషనర్ ప్రభాకరరావు, డీఈఈ వీరయ్య కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. కోతకు గురైన రోడ్డు గురించి ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి జనసేన పార్టీ ప్రతినిధి రూస్తీ తీసుకువెళ్లారు.

సీతాఫలాల ధర పతనం

» కోనాం సంతలో 50-60 కాయలున్న బుట్ట రూ.150-200
» 100-120 కాయలున్న కావిడి రూ.500-600
» గత వారంతో పోలిస్తే గిరిజనులకు దక్కింది సగం ధరే!

చీడికాడ, ఆగస్టు 29: మండలంలోని కోనాంలో గురువారం జరిగిన సంతకు ఏజెన్సీలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు కావిళ్లు, బుట్టలతో సీతాఫలాలు తీసుకువచ్చారు. వర్షం కారణంగా మైదాన ప్రాంతం నుంచి వ్యాపారులు (కొనుగోలుదారులు) తక్కువ మంది వచ్చారు. దీంతో డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోయాయి. ప్రతి గురువారంకోనాంలో జరిగే సంతకు చీడికాడతోపాటు పాడేరు, హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన వివిధ గ్రామాల గిరిజనులు అటవీ ఫలసాయ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం సీతాఫలాల సీజన్ కావడంతో సుదూరంలో వున్న గ్రామాల నుంచి నడుచుకుంటూ కావిళ్లు, బుట్టలతో సీతాఫలాలను మోసుకుంటూ ఉదయం ఏడు గంటల నుంచే సంతకు రావడం మొదలుపెట్టారు. అయితే వాతావరణం ముసురుగా వుండడం, చెదురుమదురుగా వర్షం పడుతుండడంతో సీతాఫలాలు కొనుగోలు చేయడానికి మైదాన ప్రాంతం నుంచి అనుకున్న మేర వ్యాపారులు రాలేదు. దీంతో 50 కాయలు ఉన్న బుట్ట, రూ.200 నుంచి రూ.250, అలాగే 100 నుంచి 120 కాయలు ఉన్న కావిడి రూ.500 నుంచి రూ.600 ధరలు పలికాయి. గత వారం 50 కాయలు ఉన్న బుట్ట రూ.300 నుంచి రూ.400 పలికిందని, ఈ వారం ధర సగానికి పడిపోయిందని గిరిజనులు వాపోతున్నారు. కొనుగోలుదారులు అరకొరగా రావడంతో, వారు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందని అంటున్నారు.


సీతాఫలాల బుట్టలు, కావిళ్లతో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న గిరిజన రైతులు

రైతులకు చేరువగా నూతన సాంకేతికత

» జిల్లా భూసార సంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి

రాంబిల్లి, ఆగస్టు 29 : రైతులకు నూతన సాంకేతికతను చేరువ చేసేలా సమగ్ర వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా భూసార సంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ కె.మురళి అన్నారు. గురువారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో 'ఆత్మ' సహకారంతో గ్రామీణ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల్లో సాంకేతిక అంశాలను రైతులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసీమణి పంటల సరళి, వివిధ దశల్లో వచ్చే మార్పుల గురించి తెలియజేశారు. సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్యం, భూసార పరిరక్షణ గురించి బీసీటీ కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు బి.శ్రీహరిరావు, డాక్టర్ వానాప్రసాద్‌రావు, బండి నాగేంద్రప్రసాద్ పవర్‌పాయిట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట అసిస్టెంట్ డైరెక్టర్ ఉమాప్రసాద్, నక్కపల్లి, పాయకరావుపేట, మాకవరపాలెం, కోటవురట్ల, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాల వ్యవసాయాధికారులు, 118 మంది గ్రామీణ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఉమాప్రసాద్, వ్యవసాయాధికారి తులసీమణి

విషాహార బాధిత విద్యార్థులకు ఆర్థిక సాయం

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఒక అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న ఇద్దరు గిరిజన విద్యార్థులకు రూ.50 వేల చొప్పున చెక్కులను జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి గురువారం అందజేశారు. విషాహార బాధితులైన మర్రి రంజిత్, కొర్రా సుశాంతి అనే విద్యార్థులు సంపూర్ణంగా కోలుకోవడంతో గురువారం వారితోపాటు కుటుంబ సభ్యులను కలెక్టరేట్‌కు రప్పించి ఆర్థిక సాయం అందించారు. అనుమతిలేని వసతిగృహాల్లో పిల్లలను చేర్పించవద్దని డీఆర్వో పద్మావతి సూచించారు.


సాయం చెక్కులు అందుకున్న విద్యార్థులు, కుటుంబీకులతో డీఆర్వో పద్మావతి

పాము కాటుతో రైతు మృతి

కె.కోటపాడు, ఆగస్టు 29: పొలంలో పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో రైతు మృతిచెందాడు. మండలంలోని దాలివలస గ్రామానికి చెందిన దమ్ము పెంటయ్య(50) గురువారం మధ్యాహ్నం భార్య, కుమారుడితో కలిసి పొలానికి వెళ్లాడు. ఏపుగా పెరిగిన తుప్పలు తొలగిస్తుండగా తుప్పల్లో నుంచి బయటకు వచ్చిన పాము, అతని చేతిపై కాటు వేసింది. దీంతో భార్య, కుమారుడు కలిసి వెంటనే కె.కోటపాడు ఆస్పత్రికి తీసుకువచ్చారు. కానీ అప్పటికే శరీరమంతా విషయం వ్యాపించడంతో వైద్యులు చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

నాటి వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. రోగులకు శాపం

» ఆస్పత్రికి రోడ్డు వేయని అధికారులు
» చినుకుపడితే రోడ్డు చిత్తడే
» ఆస్పత్రికి వెళ్లేందుకు భయపడుతున్న రోగులు
» రోడ్డును ఆధునికరించాలని వేడుకోలు

ఎలమంచిలి, ఆగస్టు 29: గత వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే చాలు ఆస్పత్రి రోడ్డు బురదమయం అవుతోంది. దీంతో ఆస్పత్రికి వెళ్లే రోగులు ఎక్కడ జారీపోతామోనని భయపడుతున్నారు. ఎలమంచిలి పట్టణంలో తులసీనగర్ వార్డులో రూ. రెండు కోట్లతో నూతనంగా ఆస్పత్రి భవనాలను నిర్మించారు. అయితే రహదారి నిర్మాణం చేయకుండా వదిలేశారు. దీంతో చినుకు పడితే చాలు రోడ్డు చిత్తడిగా మారి రోగులు ఆస్పత్రికి వెళ్లలేని విధంగా తయారవుతోంది. ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుపై నుంచే ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. అలాగే అక్కడికి సమీపంలోనే జగనన్న లేఅవుట్ ఉంది. ఇక్కడ రోడ్డు వేసినట్టయితే వారికి కూడా అనుకూలంగా ఉంటుంది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి నిలువటద్దంగా ఉన్న ఈ రోడ్డు కూటమి ప్రభుత్వం హయాంలోనే ఆధునికీకరణకు నోచుకుంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


చినుకు పడితే బురదగా ఉన్న ఆస్పత్రి రోడ్డు

తెలుగు ప్రజలకు స్పీకర్ శుభాకాంక్షలు


అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శాసనసభ స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు తెలుగు భాష ప్రతీకగా నిలుస్తూ విశ్వవ్యాప్తంగా ప్రత్యేకతను చాటుకుంటున్నదని పేర్కొన్నారు. మాతృ భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విస్తృత ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ధీరజ్



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెడల్స్‌తో ధీరజ్

నర్సీపట్నం, ఆగస్టు 29: సంపూర్ణ వందేమాతరం గీతాన్ని 77 సార్లు నిర్విరామంగా ఆలపించినందుకు నర్సీపట్నం ప్రాంతానికి చెందిన 'పాడుతా తీయగా..' విన్నర్ దొంతంశెట్టి ధీరజ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. ఈ ఏడాది మార్చి 20వ తేదీన స్థానిక శ్రీసత్యసాయి మందిరంలో లైవ్‌లో సంపూర్ణ వందేమాతరం గీతాన్ని పాడాడు. ప్రస్తుతం పాడుతా తీయగా మహా సంగ్రామంలో పాటలు పాడుతున్నాడు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ధీరజ్‌ని అభినందించారు.

వేములపూడి పీబీఎం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఉత్తమ క్రీడా పురస్కారం

» 189 పాయింట్లతో జిల్లాలో మొదటి స్థానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

నర్సీపట్నం, ఆగస్టు 29: వేములపూడి పీబీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉత్తమ క్రీడా పురస్కారం లభించింది. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణ చేతుల మీదుగా హెచ్ఎం, ఉపాధ్యాయులు అవార్డు అందుకున్నారు. పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో, ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. 189 పాయింట్లతో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో క్రీడా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, శాప్ కోచ్ రమణ, హెచ్ఎం గుడివాడ రమణ, ఉపాధ్యాయులు డి.రవి, పి.సుమన్ పాల్గొన్నారు.

ఐటీ రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదని, ప్రభుత్వ పెద్దలు తమను ఏనాడూ దగ్గరకు రానివ్వలేదని, ఇప్పుడు పరిస్థితులు మారినందుకు చాలా సంతోషంగా ఉందని పలువురు పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తంచేశారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఐటీ సమస్యల పరిష్కారానికి ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఐటీ పరిశ్రమలకు రాయితీపై భూములు ఇవ్వాలని పలువురు కోరినందున దీనిపై మంత్రివర్గంలో చర్చిస్తామన్నారు. విద్యుత్, ఇతర పన్నుల భారాలపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. విశాఖకు పెద్ద సంఖ్యలో విమానాలు రావాలంటే నైట్ పార్కింగ్ చార్జీలు తగ్గించాలని సింబియోసిస్ సీఈఓ నరేశ్ కోరగా, కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడితో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తామని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో తెలుగువారు ఎక్కువగా ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తామని లోకేశ్ అన్నారు. అందుకు అనుగుణంగా ఐటీ స్పేస్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ రంగంలో ఇంకుబేషన్, కమ్యూనికేషన్స్ పెంచుతామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను కూడా ప్రోత్సహిస్తామన్నారు. కేవలం ఐటీనే కాకుండా ఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాల్లోను విశాఖపట్నం అభివృద్ధి చెందుతున్నదని, వారిని కూడా ప్రోత్సహిస్తామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ సెన్సస్ కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. టాప్ 100 యూనివర్సిటీల్లో ఏపీ యూనివర్సిటీలు ఉండాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖకు విమానాల సంఖ్య పెంచాలని, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఐటీ పరిశ్రమలకు సెక్యూరిటీ, ట్రాన్స్‌పోర్టు, హైస్పీడ్ ఇంటర్నెట్ వంటివి కల్పించడం ద్వారా ఎకో సిస్టమ్ వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ చీఫ్ సెక్రటరీ సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరులో ఐటీ సంస్థలు నిర్వహిస్తున్న పది మంది విశాఖ పారిశ్రామికవేత్తలు ఈ సమావేశానికి ప్రత్యేకంగా రావడం గమనార్హం.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి అవసరం

» జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ్



విద్యార్థులతో క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ అభిషేక్‌గౌడ్, తదితరులు

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యతో పాటు క్రీడలపైనా విద్యార్థులు ఆసక్తి కనబరచాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక తలారిసింగి అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు సహజంగానే ఉత్సాహం, శారీరక సామర్థ్యంతో ఉంటారని, దీంతో క్రీడల్లో సునాయాసంగా రాణిస్తారన్నారు. అలాగే వ్యాయామ సంచాలకులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్ని చక్కని క్రీడాకారులు తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం క్రీడా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.పద్మావతి, జిల్లా క్రీడాలాభివృద్ధి అధికారి జగన్మోహనరావు, వ్యాయామ సంచాలకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

» ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ దీక్ష



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

పాడేరు రూరల్, ఆగస్టు 29 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఒక్క రోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు చేపట్టిన ఈ దీక్షలను రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణీంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని గిరిజన, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రతీ వసతిగృహంలో వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలు నెలకు రూ. 2,500కు పెంచి విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్స్ బిల్లులు చెల్లించాలని, ఖాళీగా ఉన్న వసతి గృహ నిర్వాహకులు, కుక్, కమాటీ పోస్టులు భర్తీ చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబరు 77ను రద్దు చేయాలని, పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థులకు నోట్ బుక్‌లు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్న క్యాంటిన్‌లో ఒక్క రోజు భోజనానికి రూ. 90, జైలు ఖైదీ ఒక రోజు భోజనానికి రూ.75 కేటాయిస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు రోజుకు రూ.33 కేటాయించడం ఎంత వరకు సమంజసమన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం అధ్యయనం చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, చిన్నబాబు, నాయకులు మంజుల, శిరీష, తనీష్, ఈశ్వర్, మల్లేష్, రాజు, సుశాంత్ పాల్గొన్నారు.

గొల్లపల్లి, పెబ్బెంపల్లిలో వైద్య శిబిరాలు



గొల్లపల్లిలో వైద్య సేవలు అందిస్తున్న సప్పర్ల పీహెచ్‌సీ సిబ్బంది

గూడెంకొత్తవీధి, ఆగస్టు 29 : మండలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధి గొల్లపల్లి, పెబ్బెంపల్లి గ్రామాల్లో సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం 'జ్వరాల విజృంభణ' శీర్షిక గొల్లపల్లి, పెబ్బెంపల్లి, తడకపల్లి గ్రామాల్లో జ్వరాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమల్ బాషా స్పందించి తక్షణమే జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం గొల్లపల్లి, పెబ్బెంపల్లి గ్రామాలను సందర్శించి జ్వర పీడితులకు వైద్యం అందించారు. రెండు గ్రామాల్లో 88 మందికి వైద్యం అందించారు. 45 మంది జ్వరబాధితుల నుంచి రక్తపూతలు స్వీకరించి పరీక్షలు నిర్వహించారు. ఏ ఒకరిలోనూ మలేరియా నిర్ధారణ కాలేదు. క్షయ లక్షణాలు కలిగిన ఏడుగురు బాధితుల నుంచి కళ్లె (ఉమ్మి) సేకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ హేమలత, హెచ్‌ఏ శివ, కార్యదర్శి రాధ పాల్గొన్నారు.

శ్రమదానంతో కల్వర్టుకు మరమ్మతులు



కల్వర్టు వద్ద రాళ్లను క్రమంగా పేర్చుకుంటున్న నిమ్మచెట్టు గిరిజనులు

సీలేరు, ఆగస్టు 29 : గూడెంకొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని నిమ్మచెట్టు గిరిజనులు శ్రమదానంతో కల్వర్టుకు మరమ్మతులు చేసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మచెట్టు గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద రాళ్లు కొట్టుకునిపోయాయి. దీంతో ఈమార్గంపై రోగులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో రోగులను డోలిపై ఆస్పత్రికి తరలించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో గురువారం గ్రామస్థులందరూ కలిసి శ్రమదానం చేసి కల్వర్టు వద్ద రాళ్లను సరిచేసుకుని రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఏరియా ఆస్పత్రి ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

అధికారుల ఆదేశాల మేరకు వైద్యులు, ఇతర ఉద్యోగులు విధులకు అరగంట ఆలస్యమైతే సూపరింటెండెంట్ ఆబ్సెంట్ నమోదు చేస్తున్నారు. తాజాగా విధులకు ఆలస్యంగా వచ్చిన సీనియర్ వైద్యురాలికి సైతం అబ్సెంట్ నమోదు చేశారు. దీంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు, దిగువ స్థాయి ఉద్యోగులు గాడిలో పడ్డారు. ఏరియా ఆస్పత్రిలో ఖాళీగానున్న ఎనస్థీషియా, జనరల్ సర్జన్, ఇతర ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేసేందుకు సెకండరీ హెల్త్ అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వచ్చే నెలలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలు ప్రారంభం

» వర్చువల్‌గా ప్రారంభించనున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ
» ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి
» లకేపుట్టులో ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి ఆదేశం



నూతనంగా నిర్మితమైన ఏకలవ్య పాఠశాల ఎదుట ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు



పాఠశాల నమూనా పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పెదబయలు/ అరకులోయ ఆగస్టు 29 : పెదబయలు, అరకువ్యాలీ, చింతపల్లి మండలాల్లో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల భవనాలను వచ్చే నెల 5 నుంచి 9వ తేదీల మధ్య ఏ రోజైనా ప్రధాని నరేంద్ర మోడీఏకకాలంలో వర్చువల్‌గా ప్రారంభించనున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. గురువారం మండలంలోని సీతగుంట పంచాయతీ లకేపుట్టులో రూ.20 కోట్లతో, అరకులోయ మండలం మజ్జివలసలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, ల్యాబరేటరీలు, డైనింగ్ హాలు, వసతిగృహం, ఉపాధ్యాయుల నివాస గృహాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అంతర్గత రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటి వరకూ పెండింగ్ ఉంటే ఆ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. లకేపుట్టులో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తరగతుల్లో కూర్చునేందుకు ఇబ్బంది పడుతున్నారని, ఆ భవనం ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళనతో పిల్లలను స్కూలుకు పంపడానికే భయం ఉందని గ్రామస్థులు పీవోకు మొర పెట్టుకున్నారు. నూతన పాఠశాల భవనం నిర్మించాలని కోరారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వీఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈ అభిషేక్, ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ ఆఫ్ ఇండియా సంస్థ డీజీఎండీ విశ్వనాథరావు, ఏజీఎం రవీంద్రనాథ్, ఎన్వీ సత్యనారాయణ, గురుకులం కో-ఆర్డినేటర్ పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'గిడుగు'కు ఘన నివాళులు



గిడుగు రామ్మూర్తికి నివాళులు అర్పిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ్, సిబ్బంది

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషోద్యమ నేత గిడుడు రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, సిబ్బంది గుడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాషోద్యమానికి ఆయన చేసిన కృషి జేసీ అభిషేక్ గౌడ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, కలెక్టరేట్ ఏవో అప్పారావు, ఏపీవో చిన్నికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



పద్య పఠన పోటీలో ప్రథమ స్థానం పొందిన అఖిల్‌నాయుడును అభినందిస్తున్న అధ్యాపకులు

పాడేరు రూరల్, ఆగస్టు 29 : వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ముందుగా వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు భాష వైభవం, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలల్లో 'ఆధునిక కాలంలో తెలుగు భాష ఆవశ్యకతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, అధ్యాపకులు రమేష్ బాబు, కోటేశ్వరరావు, సుమిత్ర, గణేష్, జానకీరావు, దామోదర్, భాస్కర్, సునీత, రాధాకుమారి, గోవిందరాజులు, గౌరీశంకరరావు, నిర్మలాదేవి, శంకరరావు, అచ్యుతరావు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హెచ్.ఎం.విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగు భాషా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పద్య పఠన పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి డి.అఖిల్‌నాయుడును పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పుష్పరాజ్

అరకులోయ, ఆగస్టు 29 : అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్ అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టత గురించి వివరించారు. అలాగే విద్యార్థులకు క్రీడల అవసరం గురించి విశ్లేషించారు. క్రీడోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన ఆటల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ నాగబాబు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనిత కుమారి అధ్యాపకులు డాక్టర్ ఎం.కృష్ణమోహన్, గణేష్, సుందరిరాణి, రాజు, లచ్చన్న, కామేశ్, అంబిక పాల్గొన్నారు.

ఇదేం విధానం?

మండల సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి

అనంతగిరి, ఆగస్టు 29 : మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు గైర్హాజరవడంపై ఎంపీపీ శెట్టి తీవ్ర స్థాయిలో నీలవేణి ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి అధిక శాతం మంది అధికారులు రాకపోవడంపైఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది బాధ్యతారాహిత్యమేఅవుతుందని వ్యాఖ్యానించారు. అనంతరం ఎంపీపీ నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు, సభ్యులు పలు అంశాలపై చర్చించారు. విద్యాప్రమాణాలు మెరుగునకు కృషి చేయాలని, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలలకు వెళ్లడం లేదని, గుమ్మకోట గురుకులం పాఠశాలలోని ప్రజాప్రతినిధులు వెళ్లినప్పుడు కనీసం మర్యాద గౌరవం లేకుండా పోయిందని, విద్యార్థులకు సరఫరా చేస్తున్న వెండర్ విధానంపై విచారణ చేపట్టాలన్నారు. అలాగే ఎస్.కోట నుంచి పాడేరు జిల్లా కేంద్రానికి, దేవరాపల్లి నుంచి పినకోట మీదుగా పాడేరు వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో నగేష్, డీటీ మాణిక్యం, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలజీ, ఏవో లక్ష్మీనారయణ, సర్పంచ్లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణ అవసరం



గిడుగుకు నివాళి అర్పిస్తున్న కాంతారావు తదితరులు

చింతపల్లి, ఆగస్టు 29 : తెలుగు భాష అంతరించిపోకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపై ఉందని పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుముల కాంతారావు అన్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని చౌడుపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. స్థానిక తెలుగు ఉపాధ్యాయుడు కిల్లో దామోదర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెలుగు భాష మాధుర్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, దామోదర్, శ్యామలకుమారి, రొబ్బ వెంకట రమణమ్మ, సత్యవతి పాల్గొన్నారు.



కొయ్యూరు:తెలుగుతల్లిని స్మరించుకుంటున్న లెక్చరర్లు

కొయ్యూరు : మాతృభాషను పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని మర్రిపాలెం మహిళ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు మహాలక్ష్మి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ బి.కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి తెలుగు సాహిత్యంలోని సాహితీ ప్రక్రియల గురించి వివరించారు. వృక్ష శాస్త్ర ఉపన్యాసకులు కుమారి వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన కృషిని వివరించారు రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు డాక్టరు శ్రీవిద్య తెలుగు భాష గొప్పదనాన్ని కొనియాడారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించి ఏర్పాటు చేసిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాథ్స్, ఇంగ్లీషు తదితర పాఠ్యాంశాల బోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంపీపీ



బహుమతులు అందజేస్తు ఎంపీపీ, జడ్పీటీసీ

చింతపల్లి, ఆగస్టు 29 : ఆదివాసీ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనూషాదేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ డాకర్ ఎం.విజయ భారతి ఆధ్వర్యంలో జాతీయ క్రీడ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ క్రీడల వల్ల శరీర ధారుఢ్యం, మనో ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటూ క్రీడాల్లో ప్రతిభ కనబర్చడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ పొందవచ్చునన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, సెయింటన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కళాప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, సెయింట్ ఆన్స్ పాఠశాల కరస్పాండెంట్ కార్లిస్ మేరీ, ప్రిన్సిపాల్ రేణు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాత్రుడు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రమణ, కె.లీలా పావని, డాక్టర్ కేజియ, సంతోషి, పీడీ శివరామ్ కుమార్, గ్రంథాలయ అధికారి జగ్గత్‌రాయ్, హెచ్‌డబ్ల్యూవోలు పసుపులేటి వినాయకరావు, గసాడి తిరుపతిరావు పాల్గొన్నారు.

మాతృభాషను మరవొద్దు

అనంతగిరి, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాలలోని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి. తెలుగు ఉపాధ్యాయురాలకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మంగమ్మ మాట్లాడుతూ.. తెలుగుభాష గొప్పదనంపై అవగాహన కల్పించి, దేశంలోని 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషకు మూలం ద్రావిడభాష అని, 1966లో తెలుగు భాషకు అధికారిక భాషగా ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

మన్యం రోడ్లకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

వీధుల్లో మురుగుకాల్వలు, సిమెంట్ కాంక్రీట్ రోడ్లు వేయనున్నారు. అలాగే ఉచితంగా విద్యుత్ లైన్లు, మీటర్ల ఏర్పాటు చేస్తారు.

తొలి విడతగా 148 ప్రాంతాలకు తారురోడ్లు

మన్యంలో తొలి విడతగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 148 తారు రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో రోడ్డు నిర్మాణంతో 4 నుంచి 5 పల్లెలకు రోడ్డు, రవాణా సదుపాయం కలుగుతుందనేది ఒక అంచనా. ఇందుకోసం రూ.300 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేయగా.. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే నిధులను విడుదల చేస్తామని సమాచారం ఇచ్చింది. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో రోడ్ల నిర్మాణం చేపట్టే పంచాయతీరాజ్ శాఖ(ప్రాజెక్టు విభాగం)కే పీఎం జన్‌మన్‌లోని మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను అప్పగించారు. ఏజెన్సీలో అధికంగా మారుమూల ప్రాంతాలున్న ముంచంగిపుట్టు మండలానికి అత్యధికంగా 32 రోడ్లు మంజూరు కాగా, పాడేరు మండలానికి అత్యల్పంగా ఒక రోడ్డు మాత్రమే మంజూరైంది. ప్రస్తుతం ఆదిమ జాతి గిరిజనులు జీవిస్తున్న మారుమూల గ్రామాల్లోనే డోలీ మోతల సమస్య అధికంగా ఉంది. ఆయా ప్రాంతాలకు రోడ్డు, రవాణా సదుపాయాలు లేకపోవడంతో కొండకోనల్లో కాలినడక రాకపోకలు సాగించడం, రోగులను డోలీల్లో మోసుకురావడం వంటివి జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాలకు రోడ్డు సదుపాయం సమకూరడంతో భవిష్యత్తులో డోలి మోతల సమస్యలు తగ్గుముఖం పడతాయని అధికారులు అంటున్నారు.

☛ సంక్షిప్తంగా..

పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా వెంకట రమణ



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 29 : పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడుగా ముర్ల వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి తెలిపారు. గురువారం రింతాడ జీపీయూపీ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యుల సమావేశం జరిగింది. నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సభ్యుల ఏకాభిప్రాయంతో అధ్యక్షుడుతో పాటూ ప్రధాన కార్యదర్శిగా కిల్లోత వసంతకుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా గబులంగి వెంకటరమణ ఎన్నికైనట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారి కె.మత్స్యలింగం, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు రామరాజు, పీఆర్టీయూ నాయకులు దాసు, కుడుముల వెంకటరమణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ చిన్నయ్య మృతి



ముంచంగిపుట్టు, ఆగస్టు 29 : స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న పాంగి చిన్నయ్య (56) బుధవారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హుకుంపేట మండలం స్వగ్రామం మఠంలో గల తన నివాసంలో తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హుకుంపేట ఎస్ఐ బి.సతీష్, ముంచంగిపుట్టు ఎస్ఐ కె.రవీంద్రలతో పాటు సహచర పోలీసులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే పోలీసు శాఖ తరుపున బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. చిన్నయ్య మృతదేహానికి స్వగ్రామం మఠంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రేడ్ 4, 5 కార్యదర్శుల బదిలీ రద్దుకు సర్పంచుల డిమాండ్

ముంచంగిపుట్టు, ఆగస్టు 29 : గ్రేడ్ 4, 5 కార్యదర్శులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని పలు పంచాయతీల సర్పంచులు కోరుతున్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫోరం నాయకులు కె.త్రినాథ్, వి.రమేష్, వి.లక్ష్మణ్‌లు మాట్లాడుతూ జీవో నెంబరు 3 ప్రాతిపదికన సచివాలయాల్లో వంద శాత నియామకం జరిగిందని, ఐదేళ్ల పాటు గిరిజన ప్రాంతంలో గిరిజనులకు సేవలు అందించడం జరిగిందన్నారు. వారిలో మూడేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారికి ఉద్యోగ పదోన్నతి కల్పించవలసి ఉన్నా చేయలేదన్నారు. గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న కార్యదర్శులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, గిరిజన ప్రాంతంలోనే బదిలీ చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు పంచాయతీల సర్పంచులు ఎస్.సుభాష్ చంద్ర, ఎం.బాబూరావు, శివశంకర్, నర్సింగరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

» డీఈవోకు యూటీఎఫ్ నాయకులు వినతి



వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

పాడేరు రూరల్, ఆగస్టు 29 : ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా నాయకులు గురువారం అల్లూరిజిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులతో బోధనేతర కార్యక్రమాలు చేయించడం సరికాదని, సమాజంలో గురువు స్థాయిని దిగజార్చే పనుల నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరామన్నారు. అదే విధంగా ఉపాధాయుల సర్దుబాటులో జరిగిన తప్పిదాలను సరిచేయాలని వినతిపత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.మహేశ్వరరావు, సీహెచ్.నాగేశ్వరరావు, పి.దేముడు, ఎస్.కన్నయ్య, జి.సతీశ్, ఈశ్వరరావు నాయుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో తెలుగు భాషా, క్రీడా దినోత్సవం



అల్లూరి, వివిధ వేషధారణలో విద్యార్థులు

సీలేరు, ఆగస్టు 29 : స్థానిక మేజర్ పంచాయతీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఏవీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. డీఏవీ పాఠశాల విద్యార్థులు అల్లూరి సీతారామరాజు వేషధారణ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాలలో అధ్యాపకులు గిడుగు రామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.. తెలుగు భాష, క్రీడల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్, డీఏవీ ఉపాధ్యాయుడు కమలాకర్ పాల్గొన్నారు.